## చిత్తూరు నడివీధి

# గంగజాతర ప్రారంభం

**గంగమ్మకు తొలిపూజ, హారతి ఇచ్చి జాతర ప్రారంభించిన వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు దంపతులు**

**- గంగమ్మను దర్శించుకున్న ఎస్పీ మణికంఠ చందోలు**

**- నేడు నిమ్మజ్జనంకు భారీ ఏర్పాట్లు**



తొలి పూజ నిర్వహిస్తున్న ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు దంపతులు





గంగమ్మకు అంబలి తీసుకుని వస్తున్న భక్తులు, మున్సిపల్ కమిషనర్ జె.అరుణ

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:

చిత్తూరు నడివీధి గంగజాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. చిత్తూరు బజారువీధిలో నడివీధి గంగ జాతరను మంగళవారం తెల్లవారుజాము గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, ఆయన సతీమణి సికె లావణ్య, కుమారుడు సాయి కృష్ణారెడ్డిలు గంగమ్మకు తొలిపూజ, హారతి ఇచ్చి జాతరను ప్రారంభించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మంగళవారం తెల్లవారుజాము నుండి భక్తులు బారులు తీరి గంగమ్మ తల్లిని దర్శించుకొని నైవేధ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బజారు వీధి నడివీధిలో గంగమ్మను ప్రతిష్టించడంతో ఆ ప్రాంతం మొత్తం భక్తులతో మంగళవారం క్రిక్కిరిసింది. గంగమ్మ తల్లిని ఎస్పీ మణికంఠ చందోలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ గంగమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. కొంగారెడ్డిపల్లి గంగమ్మను మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ దర్శించుకొని గంగమ్మకు అంబళ్ళు తీసుకెళ్ళి పోసి మొక్కులు తీర్చుకున్నారు. చిత్తూరు బజారువీధిలోని నడివీధి గంగమ్మను దర్శించుకోవడానికి చిత్తూరు నగర పరిధిలోని భక్తులతో పాటు చిత్తూరు పరిసర ప్రాంతాల్లోని భక్తులు, ప్రక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటకలోని పలు ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిత్తూరు గంగజాతర పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఓ వైపు జాతర నిర్వాహకులు, మరోవైపు మున్సిపల్ అధికార యంత్రాంగం, ఇంకోవైపు పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఉదయం 11 గంటల నుండి గంగమ్మకు భక్తులు అంబళ్ళు సమర్పించారు. నగర పరిధిలోని భక్తులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో గంగమ్మకు అంబళ్ళు తీసుకెళ్ళి సమర్పించారు. గంగమ్మ ప్రతిష్టించిన ప్రాంతం ఎదుట భక్తులు తీసుకువచ్చి సమర్పించే అంబళ్ళ కోసం జాతర నిర్వాహకులు ప్రత్యేక తొట్టెలను ఏర్పాటు చేశారు. ఈ తొట్టెల్లో భక్తులు అంబళ్ళలను తీసుకువచ్చి పోసి మొక్కులు తీర్చుకొన్నారు. మంగళవారం తెల్లవారుజాము నుండి భక్తులకు ప్రారంభమైన గంగమ్మ దర్శనంను నిర్వాహకులు రాత్రి 11 గంటల వరకు కొనసాగించారు. చిత్తూరు బజారు వీధి నడివీధి గంగ జాతరతో పాటు సంతపేట, గిరింపేట, కొంగారెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో గంగజాతరలు మంగళవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. సంతపేటలో గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త మాజీ ఎమ్మెల్యే ఆర్.గోపినాథ్ కుమారుడు భూపేష్ గోపినాథ్ గంగమ్మకు తొలి పూజ నిర్వహించారు. అలాగే గిరింపేట గంగమ్మకు గిరింపేట గంగజాతర వంశపారంపర్య ధర్మకర్త, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్ తొలి పూజ నిర్వహించి భక్తులకు గంగమ్మ దర్శనం కల్పించారు. అలాగే కొంగారెడ్డిపల్లి గంగమ్మకు మరో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తొలి పూజ నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మంగళవారం తెల్లవారుజాము ప్రారంభమైన చిత్తూరు నడివీధి గంగజాతర బుధవారం రాత్రి నిమజ్జనంతో ముగియనుంది. గంగజాతరలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు గంగజాతర వంశ పారంపర్య ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే సికె బాబు పొన్నియమ్మన్ గుడి నుండి బజారువీధిలోని నడివీధి గంగమ్మకు ఊరేగింపుగా సారె తీసుకెళ్ళి సమర్పించనున్నారు. బుధవారం సాయంత్రం నుండి ప్రారంభమయ్యే గంగమ్మ నిమజ్జనంకు పోలీసు శాఖ ఇప్పటి నుండి పక్కా ఏర్పాట్లు చేపట్టింది. బజారు వీధి నుండి గంగమ్మ నిమజ్జనంకు ఊరేగింపుగా బయలుదేరడానికి ముందు ఓం శక్తి భక్తుల విన్యాసాలు భారీ స్థాయిలో వుంటాయి. పోలీసులు నగరంలో ట్రాఫిక్ మళ్ళించడానికి చర్యలు తీసుకొన్నారు. అలాగే గంగజాతర సందర్భంగా చిత్తూరు నగర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ మణికంఠ చందోలు నేతృత్వంలో డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పక్కా బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## సిఎం హోదాలో తొలిసారిగా తిరుమలలో రేవంత్‌రెడ్డి



తిరుమల, మే 21 ప్రభాతవార్తప్రతినిధి:

తెలంగాణా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా రేవంత్‌రెడ్డి కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చారు. ఇక్కడ టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి సాదర స్వాగతం పలికారు. నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కాను న్నారు. పోలీసు యంత్రాంగం భద్రత ఏర్పాట్లు చేశారు. ఈఓ వెంట రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్ ఉన్నారు.

# చల్లంగా చూడమ్మా...గంగమ్మతల్లీ!

## వైభవంగా అమ్మవారికి శాంతి అభిషేకం -కోలాహలంగా జాతర వేషాలు







విశేష అలంకారంలో గంగమ్మ అమ్మవారు, పోటెత్తిన భక్తులు

తిరుపతి, మే 21ప్రభాతవార్త :

రాయలసీమజిల్లాల్లోనే ఎంతో విశిష్టత..వారంరోజులు పాటు జరిగే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. జాతరలో ముఖ్యంగా వారంరోజులపాటు పలు రకాల వేషాలంకరణలో దర్శనమిచ్చి అలసిపోయిన గంగమ్మకు మంగళవారం వేకువజామున శాంతిఅభిషేకం నిర్వహించారు. జాతరలో ఈ ప్రత్యేక అభిషేకానికి ఎంతో విశిష్టత ఉంది. గంగమ్మను వేకువజామున 12.30 గంటలకు మేల్కొలిపి పాలు, తేనె, పంచామృతం, కొబ్బరిజలం. హరిద్ర జలాభిషేకం తదితర సుగంధద్రవ్యాలతో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ అభిషేకిస్తారు. అమ్మవారిని శాంతింపజేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మంగళవారం వేకువజామున 4గంటలనుండే భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించారు. మా మొక్కులు తీర్చుకుని మమ్మల్ని చల్లంగా చూడవమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. ఈ ఏడాది అధికారుల పాలనలో ఆలయంలో హడావిడి లేకపోయింది. ప్రశాంతంగా భక్తులకు గంగమ్మదర్శనం కల్పించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, తిరుపతి డిఎస్పీ రవిమనోహర చారి, డిఆర్ఒ పెంచలకిశోర్ గంగమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు,ఈఓ మమత అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. చివరగా మంగళవారం భక్తులు సప్పరాలతో వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు రాత్రివరకు దర్శనం కల్పించారు. అలాగే బుధవారం ఉదయం పేరంటాలు వచ్చి గంగమ్మ విశ్వరూపం చెంప నరుకుడుతో జాతర పరిసమాప్తమైంది. పోలీసులు భారీ పోలీసు బందోబస్తు కల్పించారు.

# వైభవంగా శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు

## - జనసంద్రంలా మారిన కుప్పం .. అమ్మవారికి భారీగా జంతుబలులు!!





అమ్మవారి శిరస్సు ఊరేగిస్తున్న దృశ్యం , పాతపేట వద్ద పోటెత్తిన భక్తులు

కుప్పం, మే 21 ప్రభాతవార్త

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి.. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ తల్లి.. అందునా అమ్మవారి శిరస్సు ఊరేగింపు.. ఈ వేడుకలు తిలకించేందుకు భక్తజన కోటి అశేష రీతిలో హాజరయ్యారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఈ జాతరను తిలకించేందుకు రెండు కళ్లు చాలవనే రీతిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. విలువైన ఆభరణాలతో అమ్మవారిని ఈ సందర్భంగా అలంకరించారు. ఉదయంనుంచే పాతపేట ప్రాంతం జనసంద్రంగా మారిపోయింది. అమ్మవారి శిరస్సు కళ్లకు తెర తొలగించిన అనంతరం అమ్మవారి శిరస్సు ఊరేగింపు మొదలైంది. అక్కడనుంనుంచి గాండ్లవీధి, మునస్వామిపురం, నేతాజీ రోడ్డు,చిత్తరంజన్ రోడ్డు, టిబి రోడ్డు, కొత్తపేట, తపాలరాజు వీధి, ప్యాలస్ రోడ్డు, సోమయ్య వీధి, పైబాట తదితర ప్రాంతాల మీదుగా అమ్మవారి శిరస్సును ఊరేగించారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారికి జంతుబలులు ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ వాసులే కాక వివిధ గ్రామీణ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు అమ్మవారికి బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకోవడం కన్పించింది. ఈసందర్భంగా రహదారులన్నీ రక్తసిక్తంగా మారాయి.పలువురు తమ చిన్నారులను అమ్మవారి శిరస్సు వద్ద ఉంచిమొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు సందర్భంగా పట్టణంలో జనం సందడి అధికంగా కన్పించింది. వేల సంఖ్యలో భక్తులు కుప్పం పట్టణం చేరుకోవడం కన్పించింది. అమ్మవారి ఆలయం, శ్రీ ముత్తుమారెమ్మ ఆలయ విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా జాతర ఏర్పాట్లను దేవదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ ప్రసన్న లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు పర్యవేక్షించి ఇఒ చలపతికి తగు సూచనలు ఇచ్చారు. అమ్మవారి శిరస్సు ఊరేగింపు బందోబస్తును డిఎస్పీ శ్రీనాథ్ పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు చేపట్టారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఆలయ ఛైర్మన్ కెవి మంజునాథ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్,ఎంపిసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి,అర్చకులు సోముస్వామి, పూజారులు షణ్ముగం, బుజ్జి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**నేడు శ్రీ తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం :**

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమాంబ జాతరలో చివరి ఘట్టంగా అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం జరుగుతుంది. బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సు ఆలయంకు చేరుకున్న అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం భక్తులకు కల్పిస్తారు. వేల సంఖ్యలో వచ్చే భక్తుల కోసం ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి 11గంటల వరకు అమ్మవారి విశ్వరూప దర్శన కార్యక్రమం ఉంటుంది. అనంతరం అమ్మవారి జలవాసమేగే కార్యక్రమంతో జాతర ముగియనుంది.

# వైభవంగా ధ్వజారోహణం





కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సంబంధించి ధ్వజారోహణం చేస్తున్న వేదపండితులు , రాత్రి పెద్దశేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నారాయణవనం, మే 21 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా నారాయణవనం పుణ్యక్షేత్రంలో వెలసిన అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగ దైవంగా విరాజిల్లుతున్న పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్స వాలకు సంబందించి మంగళవారం ఉదయం 7.45నుంచి9 గంటల మిథున లగ్నంలో వేదపండితులు వేదమంత్రాలను వినిపించి ధ్వజారోహణం ఘనంగా చేశారు. అంతకుముందు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని తిరుచ్చివాహనంపై అధిరోహించి గ్రామపుర వీధుల్లో భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. అమ్మవారుతో కలిసి శ్రీవారు ఊరేగించే సమయంలో సేనాధిపతి కూడా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పిం చుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, భేరితాడనము నిర్వహించారు. ధ్వజారోహణం జరిగిన తర్వాత శ్రీదేవి,భూదేవి, సమేత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం చేశారు. సాయంత్రం 6నుంచి7 గంటల వరకు ఊంజల్‌మండపంలో ఊ ంజల్‌సేవ నిర్వహించారు. ఊంజల్‌సేవ సందర్భంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవారి సేవలో తరించారు. రాత్రి 7గంటలకు శ్రీవారు పెద్దశేషవాహనాన్ని అధిరోహించి నగరు వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ శ్రీవారు భక్తులకు అభయమిచ్చారు. భక్తులకు టిటిడి అధికారులు శ్రీవారి మహా ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఒ నాగరత్న, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు,

# వర్షాలతో స్ట్రాంగ్ రూమ్స్ భద్రత మరింత భద్రం

## - పోలీసు అధికారులకు ఎస్పీ మణికంఠ చందోలు దిశా నిర్ధేశం

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:



చిత్తూరు పరిసర ప్రాంతాల్లో బుధవారం భారీగా వర్షం నమో దయ్యే అవకాశం వుందని వా తావరణ కేంద్రం హెచ్చరికలతో ఎస్పీ మణికంఠ చందోలు అప్ర మత్తం అయ్యారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రం లోని ఇవిఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్‌ను మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ బుధవారం భారీ వర్షం కురిస్తే వర్షపు నీరు స్ట్రాంగ్ రూమ్స్‌లోకి వెళ్ళకుండా పక్కా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే స్ట్రాంగ్ రూమ్స్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి దిశా నిర్ధేశం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టంగా భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఎస్.ఆరీఫుల్లా, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# రామిరెడ్డిగారిపల్లి, కూచువారిపల్లెలను సందర్శించిన ఎస్పీ



చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త

ఎన్నికల పోలింగ్ తర్వాత అల్లర్లు జరిగిన చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కూచువారిపల్లి, రామిరెడ్డిగారిపల్లెలను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మంగళవారం సందర్శించారు. అక్కడ పోలీస్ పికెట్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అలాగే స్థానిక రాజకీయపరంగా ఎలాంటి విషయాలు చర్చించకుండా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్, చంద్రగిరి డిఎస్పీ శరత్‌కుమార్, ఎస్బీ సిఐ శ్రీనివాసులు, చంద్రగిరి సిఐ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిమ్మకాయపై 'గంగమ్మ' చిత్రం





కాణిపాకం, మే 21 ప్రభాతవార్త:

చిత్తూరులో ప్రతిష్టాత్మకంగా జరిగే నడివీధి గంగమ్మ జాతరను సందర్భంగా నిమ్మకాయపై గంగమ్మ చిత్రాన్ని యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల ఆర్ట్‌మాస్టర్ కె.దామోదరాచారి వైవిద్యభరితంగా చిత్రీకరించారు. గతంలో వేపాకుపై, టెంకాయపై గంగమ్మ చిత్రాలను చిత్రీకరించి ఆకట్టుకున్న దామోదరాచ్చారి గంగమ్మ అమ్మవారికి ఎంతో ముఖ్యమైన నిమ్మకాయపై గంగమ్మ చిత్రాన్ని అద్భుతంగా రూపొందించారు.

## రేపటి నుండి వేరుసెనగ విత్తనాలు పంపిణీ

పాలసముద్రం, మే 21 ప్రభాతవార్త:
ఖరీఫ్ వేరుసెనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ధరకు గురువారం నుండి రైతు భరోసా కేంద్రాల్లో వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేయనుందని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని 9 రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్, సెరికల్చర్, ఉద్యానవన అసిసెంట్ల వద్ద విత్తనాలు అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకొని విత్తనాలు పొందవచ్చునన్నారు. వేరుసెనగ విత్తనం 30 కేజీల బస్తా ధర రూ.2,850 అని ఇందులో 40 శాతం సబ్సిడీ రూ.1,140 పోను మిగిలిన రూ.1,710 రైతులు చెల్లించి విత్తనాలు పొందవచ్చునన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదార్ పాసు పుస్తకం లేదా 1బి, ఆధార్ కార్డు తీసుకెళ్ళి బయో మెట్రిక్ వేసి రసీదు పొంది అనంతరం విత్తనాలు పొందవచ్చునన్నారు. ఒక రైతుకు ఒక బస్తా సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## రేపటి నుండి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు

గుడిపాల, మే 21 ప్రభాతవార్త:
మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుండి సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు రైతులకు పంపిణీ చేయనున్నాట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి మాధవి తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుండి రైతులు రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వహించి వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ అసిసెంట్ల వద్ద పేర్లు నమోదు చేసుకొని డబ్బులు చెల్లించి రసీదు పొంది ఆపై విత్తనాలు పొందాలన్నారు. 30 కేజీల వేరుసెనగ విత్తనాల బస్తా ధర రూ.2,850 కాగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అంటే రూ.1,140 సబ్సిడీ ఇస్తోందని, సబ్సిడీ మినహాయించుకొని రైతు రూ.1,710 చెల్లించి ఒక బస్తా వేరుసెగన విత్తనం పొందవచ్చునన్నారు. రైతులు పొందిన సబ్సిడీ వేరుసెనగ విత్తనాలను తప్పనిసరిగా తమ పొలంలో సాగు చేసి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

## తీర్మానాలు లేని మండల మీట్

బంగారుపాళ్యం, మే 21 ప్రభాతవార్త:



స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి అమరావతమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో వుండటంతో ఎలాంటి తీర్మానాలు చేయరాదని అధికారులు ప్రజాప్రతినిధులకు సూచించడంతో ఆ మేరకు ఎలాంటి తీర్మానాలు చేయకుండా మండల సమావేశంను ముగించారు. మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి అమరావతమ్మ సూచించారు. వర్షాలు కురుస్తుండటంతో ఉపాధి పనులు వేగవంతం చేయాలని అధికారులు తెలిపారు. ప్రభుత్వం రాయితీతో వేరుసెగన విత్తనాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా వుందని మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకొని సబ్సిడీ విత్తనాలను పొందాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, తహసిల్దారు సుబద్రమ్మ, ఎంపిడిఓ శివశంకర్, ఎంఇఓ నాగేశ్వరరావు, హౌసింగ్ ఎఇ గుణశేఖర్‌రెడ్డి, పిఆర్ ఎఇ గురవారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకారం

బంగారుపాళ్యం, మే 21 ప్రభాతవార్త:
వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి వ్యాపారస్తులు సహకారం అందించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటరమణ కోరారు. స్థానిక మార్కెట్‌లో మామిడి కాయల మండీల వ్యాపారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం చేపట్టారు. గత ఏడాది రూ.1.40 కోట్లు యూజర్ ఛార్జీల కింద వసూలు చేయాల్సి వుండగా రూ.84 లక్షలు మాత్రమే వసూలు చేశామన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రూ.1.20 కోట్లు యూజర్ ఛార్జీలు నిర్ణయించిందని, ఈ మేరకు మండీ వ్యాపారస్తులు మార్కెట్ కమిటీకి సహకారం అందించాలన్నారు. అలాగే మార్కెట్ కమిటీకి చెల్లించాల్సిన అద్దె బకాయిలను ఈ నెలాఖరులోపు చెల్లించాలన్నారు. ప్రతి రెండేళ్ళకు 10 శాతం పెంపుతో అద్దె కమిటీకి చెల్లించాలన్నారు. అలాగే వ్యాపారస్తులు రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## హనుమంతవాహనంపై చెన్నకేశవస్వామి దర్శనం



శ్రీకాళహస్తిరూరల్,మే 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లు తిరుచ్చి వాహనంలో భక్తులకు దర్శనం భావం కల్పించారు. ఇక సాయంత్రం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో ముస్తాబు చేసారు. హనుమంత వాహనంలో ప్రతిష్టించి మేళ తాళాలు,మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదారుడు తమ్మన్నగారి ధర్మయ్య మొదలియార్ కుటుంబస భ్యులు వెంటరాగా చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,దుర్గా ప్రసాద్‌ల పర్యవేక్షణలో ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

## చిత్తూరు జిల్లా క్రీడా భారతి నూతన కమిటీ ఎంపిక

– అధ్యక్షులుగా డాక్టర్ మునిక్రిష్ణయ్య



వెదురుకుప్పం, మే 21 ప్రభాతవార్త :
చిత్తూరు జిల్లా నూతన క్రీడా భారతి కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో పాటు అధ్యక్షులుగా డాక్టర్ పి.మునిక్రిష్ణయ్యను నియమించిన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడ మైదానం ఆవరణలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ కమిటీ ఎంపిక పరిశీలకులు ధనంజేయులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అందులో భాగంగా సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో కమిటీ కార్యవర్గం ఎంపిక చేశారు. విశ్రాంతి ఫిజికల్ డైరెక్టర్ పి.మునిక్రిష్ణయ్యను అధ్యక్షులుగా, క్రిష్ణయ్యను కార్యదర్శిగా, వై.త్రిలోకసుందరిని కోశాధికారిగా, ఉపాధ్యక్షులుగా బాబు( ఫిజికల్ డైరెక్టర్ పుత్తూరు), లక్ష్మీ(ఫిజికల్ డైరెక్టర్ పెనుమూరు), పరమాత్మయ్య( ఉపాధ్యాయులు), రవీంద్రా రెడ్డి(ఫిజికల్ డైరెక్టర్ చిత్తూరు), జాయింట్ సెక్రెటరీలుగా దాము( విశ్రాంతి పిడి, వెదురుకుప్పం), రమేష్(ఫిజికల్ డైరెక్టర్ కార్వేటి నగరం), టి.రజని( పల్లాలు), మునిరత్నం(పిడి పచ్చికాపల్లం), కార్యవర్గ సభ్యులుగా హరిబాబు, సాయి, పార్వతి, రెడ్డి ఈశ్వరి, ఇందు, లోకేష్, మధు, ఇ.ఇందులు ఎన్నికైన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ధనంజేయులు రెడ్డి మాట్లాడుతూ నాలుగు రెవెన్యూ డివిజనల్స్‌లో నూతన కమిటీల నియామకం చేపట్టి త్వరలో వెదురుకుప్పంలో క్రీడా భారతి అకాడమీ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చేలా చర్యలు చెపట్టనున్నట్లు తెలిపారు. 2036 ఒలంపిక్స్‌లో భారత దేశం తర పున ఒలంఫిక్ మెడల్ సాధించే విధంగా క్రీడా భారతి క్రీయశీలకంగా పనిచేస్తుందని వివరించారు. ఎంపిక ప్రక్రియలో తిరుపతి జిల్లా ఒలంఫిక్ అసోసియేషన్ కార్యదర్శి మిట్టపల్లె సురేంద్ర రెడ్డి, క్రీడా కోచ్‌లు, సీనియర్ క్రీడకారులు, జాతీయ స్ధాయి క్రీడాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వాద్ గోల్డ్ లోన్ బ్రాంచ్‌లో గోల్‌మాల్

రామకుప్పం, మే 21 ప్రభాతవార్త
స్థానికంగా ఉన్న ఆశీర్వాద్ గోల్డ్ లోన్ బ్రాంచ్‌లో గోల్‌మాల్ జరుగుతోందని ఖాతాదారులు పేర్కొంటున్నారు. గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో సుమారు ముప్పై లక్షల విలువ చేసే బంగారం కడియాలను 89 పెద్దూరుకు చెందిన ఓ బంగారు వ్యాపారి ఈ బ్రాంచ్‌లో తాకట్టు పెట్టాడు. కొన్ని రోజులకే బ్రాంచ్ ఉన్నతాధికారులు ఆ బంగారాన్ని పరిశీలించి నాసిరకం బంగారం కొంత ఉందని నిర్ధారించారని సమాచారం. కాగా బ్రాంచ్ మేనేజర్ బంగారు వ్యాపారితో కుమ్మకై 6నట్లు పోలీసులకు సైతం ఫిర్యాదు చేయగా అంతలో బంగారు కుదవ పెట్టిన వ్యాపారి పరారయ్యాడు. కాగా ఈ బ్రాంచ్‌లో కస్టమర్ పేరుపైన పెట్టి గోల్డ్ లోన్ మరొకరిపై పెట్టారని వేరేవారి పక్షటోలు మార్చారని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. బంగారం తనఖా పెట్టే సమయంలో ఓ రేటు, విడిపించే సమయంలో మరో రేటు వడ్డీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ గోల్డ్ లోన్ బ్రాంచ్‌పై విచారణ చేపట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు.

## సంటపేటలో గంగజాతర ప్రారంభం

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:
సంతపేటలో గంగజాతర వేడుకలు మంగళవారం అ ట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. గంగజాతర ధర్మ కర్త, మాజీ ఎమ్మెల్యే ఆర్.గోపినాథ్ తనయుడు భూ పేష్ గోపినాథ్ మంగళవారం తెల్లవారుజాము గంగమ్మకు తొలిపూజ నిర్వహించి జాతర ప్రారంభించి భక్తులకు గంగమ్మ దర్శనభాగ్యం కల్పించారు. సంతపేట గంగమ్మను దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అంబళ్ళు, నైవేధ్యాలు గంగమ్మకు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా జాతర ధర్మకర్త భూపేష్ గోపినాథ్ మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పక్కా చర్యలు తీసుకొన్నామన్నారు. గంగజాతర నిర్వహణలో భాగంగా బుధవారం పచ్చ గరిగ ఊరేగింపు, అనంతరం నిమజ్జనం వుంటుందన్నారు.

## అట్టహాసంగా గిరింపేట గంగజాతర ఉత్సవాలు

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త: చిత్తూరు



నగర గంగజాతర వేడుకల్లో భాగంగా గిరింపేటలో గంగజాతర మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. గిరింపేట గంగమ్మకు మంగళవారం తెల్లవారుజాము గంగజాతర ధర్మకర్త, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్ తొలి పూజ నిర్వహించి జాతరను ప్రారంభించారు. ఆపై భక్తులు గంగమ్మను దర్శించుకొన్నారు. ఉదయం 11 గంటల నుండి భక్తులు గంగమ్మకు అంబళ్ళు పోయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరింపేట గంగజాతర ధర్మకర్త, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం గిరింపేట దుర్గమ్మ ఆలయం నుండి గంగమ్మకు సారె తీసుకువచ్చి సమర్పించడం జరుగుతుందని, అనంతరం గంగమ్మ నిమజ్జన వేడుకలు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## చిత్తూరు గంగమ్మ నిమజ్జనం ఎఫెక్ట్

– నేడు భారీగా ట్రాఫిక్ మళ్ళింపు
– చిత్తూరు నగరంలోకి భారీ వాహనాలకు బ్రేకులు

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:
చిత్తూరు నడివీధి గంగజాతర పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ప్రారంభం కానున్న గంగమ్మ నిమజ్జన వేడుకలను దృష్టిలో వుంచుకొని పోలీసులు నగర పరిధిలో ట్రాఫిక్ మళ్ళింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. చిత్తూరు నగరంలోనికి బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుండి భారీ వాహనాలు ప్రవేశించకుండా పోలీసులు నిషేధం విధించారు. ఏ ఒక్క భారీ వాహనం చిత్తూరు నగరంలోనికి రాకుండా పోలీసులు ట్రాఫిక్ మళ్ళింపు చేశారు. చిత్తూరు నగరంలోకి భారీ వాహనాలు(లారీలు, ట్రక్కులు) తదితరాలు రాకుండా రెడ్డిగుంట జంక్షన్, ఇరువారం జంక్షన్, కాణిపాకం కంక్షన్, మురకంబట్టు జంక్షన్, కట్టమంచి వై జంక్షన్, సాంబయ్య కండ్రిక జంక్షన్ల మీదుగా పోలీసులు మళ్ళించారు. అలాగే వేలూరు వైపు నుండి చిత్తూరు వైపుకు వచ్చే ఆర్టీసీ బస్సులు రెడ్డిగుంట జంక్షన్–ఇరువారం జంక్షన్–కాణిపాకం జంక్షన్–మురకంబట్టు జంక్షన్–ఎల్‌జిబి టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్ళేలా పోలీసులు చర్యలు చేపట్టారు. అలాగే పలమనేరు వైపు నుండి చిత్తూరు వైపుగా వచ్చే ఆర్టీసీ బస్సులను ఇరువారం జంక్షన్–కాణిపాకం జంక్షన్–మురకంబట్టు జంక్షన్–ఎల్‌జిబి టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్ళడానికి ట్రాఫిక్ మళ్ళించారు. అలాగే పుత్తూరు వైపు నుండి చిత్తూరు వైపుకు వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు సాంబయ్యకండ్రిగ జంక్షన్–కట్టమంచి వైజంక్షన్–ఎల్‌జిబి టవర్స్ మీదుగా ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండ్‌లకు వెళ్ళేలా ట్రాఫిక్‌ను పోలీసులు మళ్ళించారు. వేలూరు వైపు నుండి చిత్తూరు వైపుకు వచ్చే ప్రైవేటు బస్సులను రెడ్డిగుంట జంక్షన్ వరకు మాత్రమే అనుమతి వుంటుంది. అలాగే పలమనేరు వైపు నుండి చిత్తూరు వైపు వచ్చే ప్రైవేటు బస్సులకు ఇరువారం జంక్షన్ వరకు మాత్రమే అనుమతి వుంటుంది. అలాగే లైట్ వాటర్ వాహనాలు(కార్లు, ఆటోలు), ద్విచక్రవాహనాలు ఎల్‌జిబి టవర్స్–దర్గా జంక్షన్– కోర్టు జంక్షన్–ఆర్టీసీ బస్టాండ్–ఫ్లైఓవర్ వరకు మాత్రమే అనుమతించడం జరిగింది.

## కూటమిదే విజయం

– మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి



పలమనేరు, మే 21 ప్రభాతవార్త
రాష్ట్రంలో జూన్ 4వతేది ఎన్నికల ఫలితాల సునామీ ఖాయమని, ఎన్డీయే కూటమికే అధికారం దక్కుతుందని మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, వి.కోట మండలాల నేతలతో ఆయన వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. జూన్ నాలుగో తేదిన ఎన్నికల కౌంటింగ్‌లో తెదేపా, జనసేన, బిజెపి పార్టీలకే సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. పలమనేరు నియోజకవర్గంలో సైతం తెలుగుదేశం పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. రాష్ట్రానికి మరలా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమని జోస్యం చెప్పారు. పార్టీ గెలుపుకై కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నేతలు, కార్యకర్తలు పడిన కష్టనష్టాలకు తగు ఫలితం తప్పక అందించి అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్ గౌడ్, సుబ్రమణ్యాం శెట్టి, సీనియర్ నేతలు రామచంద్రనాయుడు, చౌడప్ప, రాంబాబు, కృష్ణవేణి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

వెదురుకుప్పం, మే 21 ప్రభాతవార్త :
మండల కేంద్రంలోని చవటగుంటలో వేలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నరసింహస్వామి జయంతి పురస్కరించుకుని వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయం శుద్ది చేసిముందు భాగంలో చలువ పందిరిలు వేసి, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం వేద పండితులచే వేద పారాయణం, గణపతి పూజ,కలశ పూజ, ఘణపతి హోమం, రుద్రహోమం, సుదర్శన హోమం, మూలవర్లకు అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి, లక్ష్మీ నరసింహస్వామి, వినాయక స్వామి వారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలతో విశేషంగా అలంకరించిమంత్రోచరణ, మంగళవాద్యముల నడుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు దైవ దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం కలశ పూజ నవగ్రహ హోమము, అర్చన, పూలంగి సేవ కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతివారి ఆధ్వర్యంలో హరికథ గానం చేశారు. ఉదయం పూజకు ఉభయదాతలుగా తిరుపతి వేదాంతపురంకు చెందిన రమ్య కిషోర్ రెడ్డి దంపతులు వ్యవహరించారు. కాగా బుధవారం ఉదయం 10 –12 గంటల మధ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. అలాగే సాయంత్రం స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మిట్టపల్లె మంజుల సుబ్రమణ్యాం రెడ్డి,ముఖ్య కార్యనిర్వహకులు జయరామ రెడి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీదే విజయం

జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, మే 21, ప్రభాతవార్త
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, అభ్యర్థి నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి వ్యక్తం చేశారు.



నియోజకవర్గంలోని నాయ కులు, కార్యకర్తలు వెంకటగిరిలోనే ఆయన నివాస గృహంలో వచ్చి కలిసి ఫలితాల్లో వచ్చే మెజారిటీ గురించి వివరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 151 యొక్క స్థానాలు పైగా విజయం సాధిస్తారని తెలిపారు. తిరుపతి జిల్లాలోని తాను భారీ మెజారిటీతో గెలుస్తానని చెప్పారు. 2019లో వైసిపి గెలిచిన తర్వాత ప్రజలకు ఏమి కావాలో అన్ని ఇచ్చారని కనుక మరల వైసిపిని గెలిపిస్తానని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో మే నెల 11వ తేది తోనే తెలుగుదేశం కనుమరుగైందని చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పని చేశారని తెలిపారు. ఆయన వవెంట పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, టౌన్ క్లబ్ అధ్యక్షులు లక్కమనేని కోటేశ్వర రావు, వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, జెసిఎస్ కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు నాగయ్య, దశరథ రామ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో కార్డాన్ సెర్చ్

సూళ్లూరుపేట, మే 21 ప్రభాతవార్త



రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూళ్లూరుపేటలో మంగళవారం ఉదయం సిఐ మధుబాబు ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూళ్లూరు ప్రాంతంలో ఎస్ఐ రహీమ్‌రెడ్డి, తడ ఎస్ఐ నరసింహారావు తదితరులు బృందాలుగా ఏర్పడి కార్డన్ సెర్చ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేని ఏడు మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను గుర్తించి సీజ్ చేశారు. ఆటో, మోటార్‌బైక్‌లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ప్రక్రియ జూన్ 6వ తేదీ వరకు అంచలంచెలుగా కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## గూడూరుపై డిఆర్ సమీక్ష

కోట,మే 21 ప్రభాతవార్త



గూడూరు నియోజకవర్గం లోని కోట మండలంలో వైకాపా కు ఏ గ్రామంలో ఏంత మెజార్టీ రాబోతుందని వెంకటగిరి నియోజకవర్గం పరిశీలికులు, సిఈసి సభ్యులు కొడవలూరు ధనంజయరెడ్డి తన నివాసంలో కోట మండలం వైకాపా నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఊను గుంటపాళెం, చిట్టేడు, మద్దాలి, రుద్రవరం,తదితర గ్రామాలోల బూత్‌ల వారీగా లెక్కలు తీశారు. అన్ని గ్రామాల్లో వైకాపాకు బాగ ఓట్లు వేశారని ఆయా గ్రామ నాయకులు పేర్కొన్నారు.ఈ ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి దనంజయరెడ్డి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమీక్షలో ఎంపిపి దాసరి అంజమ్మ , చేవూరి నాగేశ్వరరావు,తన్నమాల కోటారెడ్డి నాగూర్ యాదవ్, పుట్టానారాయణ, శివరామనాయుడు,సుబ్రమణ్యాం యాదవ్,తదితరులు పాల్గొన్నారు

## నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్

గూడూరు డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి



గూడూరు, మే 21 ప్రభాతవార్త
ప్రజలు నివసించే ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు, వాహనాలు ఏమైనా ఉన్నట్లైయితే వెం టనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని గూడూరు డిఎస్పి సూర్యనారా యణ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజ్ ఆదేశాల మేరకు పోలీసు బలగాలతో కలిసి మంగళవారం గూడూరు డిఎస్పి రెండవ పట్టణ పరిధిలోని గాంధీ నగర్, ప్రశాంతి నగర్, ఇందిరమ్మ కాలనీ, టిడ్కో నివాస ప్రాంతాల్లో (కార్డాన్ సెర్చ్) తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, పత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకుని రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి సూర్య నారాయణ రెడ్డి మాట్లాడుతూ గూడూరు శివార్లలో నిత్యం పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు. బయట వ్యక్తులు ఎవరైనా ఇక్కడ తలదాచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవచ్చుననే అనుమానంతో పోలీసు శాఖ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం పలు వాహనాల రికార్డులను డిఎస్పి పరిశీలించారు. నెంబరు ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సిఐలు రవి కిరణ్, వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐలు మనోజ్, అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

## యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

కోట,మే 21 ప్రభాతవార్త



కోట మండలం కర్లపూడి గ్రామం లోని మంగళవారం సిద్దవరం సొసైటి మాజీ అధ్యక్షులు సన్నారెడ్డి చెందచురాఘవరెడ్డి దాతృత్వంతో 30 వేలు విలువ చేసి క్రికెట్ ,వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా యువ క్రీడా కారులు మాట్లాడు తూ చెంచురాఘ వరెడ్డి పెద్ద మనస్సుతో క్రీడాకారులు అడిగిందే తడువుగా ఆయన తమకు క్రికెట్ కిట్లు అందచేయడం గొప్ప విషయమన్నారు. అంతే కాకుండా పేద ప్రజలు కష్టాలు తెలిసిన మహనీయుడు రాఘవరెడ్డిని యువత ఆయన సే గుణాన్ని కొనియాడారు. ఆయనకు తాము ఎల్లప్పుడు రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు. చెంచురాఘవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, శ్రీహర్ష, రాజా, నాగేంద్ర, శ్రీహరి,తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ నిఘా...

ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు నిర్బంధ తనిఖీలు

కోట,మే 21 ప్రభాతవార్త
ఎక్కడికక్కడ తనిఖీలు.. అనుమానిత వ్యక్తులు పాత నేరస్తులను అదుపులోకి తీసుకోవడం.. పత్రాలు లేని వాహనాలు సీజ్ చేయడం ఇవీ జిల్లా పోలీస్ శాఖ రెండు రోజుల నుంచి చేస్తున్న నిర్బంధ తనిఖీలు..రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల జరిగిన అనంతరం చోటు చేసుకున్న పరిణామాలు.. హింసాత్మక ఘటనలతో ఎన్నికల సఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. లెక్కింపు ముందు,, తర్వాత మరి కొన్ని ఘటనలు చోటు చేసుకునే అవకాశాలు ఉనాయన్న కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. నియోజకవర్గాల వారీగా పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందంటూ ప్రకటనలు చేస్తున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి సమావేశాలు నిర్వహిస్తున్నారు.పెట్రోల్ బంకుల్లో జూన్ 10 వ తేదీ వరకు విడిగా పెట్రోల్ ,డీజల్ విక్రయించొద్దని పోలీసులు అన్ని బంకులు నిర్వాహాకులకు నోటీసులు జారీ చేశారు.నూతనంగా వచ్చిన ఎస్పీ హర్షవ్దన్ రాజు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

## వైభవంగా కొంగారెడ్డిపల్లి గంగజాతర

చిత్తూరు, మే 21 ప్రభాతవార్త:
చిత్తూరు నగర పరిధిలో జరుగుతున్న గంగజాతర వేడుకల్లో భాగంగా కొంగారెడ్డిపల్లిలో గంగజాతర ఉత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. కొంగారెడ్డిపల్లి గంగమ్మకు మంగళవారం తెల్లవారుజాము డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి తొలి పూజ నిర్వహించి భక్తులకు గంగమ్మ దర్శన భాగ్యం కల్పించారు. కొంగారెడ్డిపల్లి గంగమ్మను మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ దర్శించుకొని గంగమ్మకు అంబలి సమర్పించారు. గంగజాతర నిర్వహణలో భాగంగా బుధవారం సాయంత్రం గంగమ్మ నిమజ్జనం ప్రారంభం అవుతుందని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



కోట,మే 21 ప్రభాతవార్త
కోట మండలం చెందోడు గ్రామంలో మంగళవారం ఎల్లసిరి కోటయ్యకు చెందిన గేదె విద్యుత్ ఘాతంతో మృతి చెందింది. విద్యుత్ టాన్స్‌పార్మం పక్కనే డ్రైనేజ కాలువలో ఆగేదె వెళ్లింది. దీంతో ఆకాలువలో విద్యుత్ తీగ వలన సరఫరా కావడంతో ఈగేదె మృతి చెందింది. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే తన గేదె చనిపోయిందని బాధితుడు కోటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

## పూడిపోతున్న బోరు - పట్టించుకోని అధికారులు

పాకాల, మే 21 ప్రభాతవార్త
స్థానిక పాకాల పట్టణంలోని పూరిపేటకు వెళ్లేటటువంటి దారిలో రోడ్డు పక్కన 50 సంవత్సరాల నుంచి పూరిపేట మొత్తానికి నీటిని అందించిన బోరు కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది. వివరాల్లోకి వెళితే తోటపల్లికి వెళ్లేటటువంటి రోడ్డు పక్కన ఉన్న బోరు ఎంతో వ్యయ ప్రయాసలతో మంజూరు చేసుకుని నిరుపయోగంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ బోరు కొంత కాలంగా పనిచేయడం లేదు. బోరు సగం వరకు పూడిపోయి ఉంది. ఈ బోరు నుంచి నిత్యం మంచినీళ్లను పూరిపేటకు, పట్టణ ప్రాంతంలోని షాపులు వాళ్లకి ఈ బోరు ద్వారా మంచి నీటిని వాడుకుంటూ ఉన్నది. ఈ బోరు నుంచి నిత్యం మంచి నీళ్లను పూరిపేటకు, పట్టణ ప్రాంతంలోని షాపులు వాళ్లకి ఈ బోరు ద్వారా మంచి నీటిని వాడుకుంటూ ఉన్నారు. ప్రస్తుతం బోరు సగం పూడిపోయి నిరుపయోగంగా ఉన్నది. బోరు గురించి సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పంచాయితీ కుళాయి ద్వారా నీటిని అందిస్తున్నప్పటికి కూడా పైపులు పగిలిపోవడం, గేటు వాళ్లు విరిగిపోవడం బోరు రిపేరు అయిన సందర్భంలోనూ ఈ బోరు ద్వారా నీటిని వాడుకునే అవకాశం ఉందని స్థానికులు భావిస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బోరుని బాగు చేసి స్థానికులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పిం చాలని వేడుకుంటున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

-తవణంపల్లె మండల మీట్

తవణంపల్లె, మే 21 ప్రభాతవార్త:



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన ప్రజా సమస్యలను ఎన్నికల కోడ్ అనంతరం వాటి పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కె.ప్రతాప్ రాయల్ సుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షత మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాటా్లడుతూ మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు కావాల్సిన వేరుశెనగ కాయలు, ఎరువులు పంపిణీకి సిద్దంగా వున్నాయని వాటిని ఈనెల 23 నుండి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే క్షయ వ్యాధి నివారణకు 60 ఏళ్ళు పైబడిన వారికి ప్రతి గురువారం మండలంలోని అన్ని సచివాలయాల్లో బిసిజీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీన్‌కుమార్ తెలిపారు. అలాగే త్రాగునీరు, విద్యశాఖ ప్రగతిపై సమీక్షించారు. ఈసమావేశంలో జడ్పీటీసీ భారతి,ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ప ంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సదుంకు 1405 క్వింటాళ్ళు వేరుసెనగ విత్తనాలు

సదుం, మే 21 ప్రభాతవార్త



ఖరీఫ్ 2024 సీజన్‌లో రైతులకు పంపిణీ చేయడానికి సదుం మండలానికి1405 క్వింటాళ్ల వేరుసెనగ విత్తనకాయలు మంజూరైనాయని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. వీటిలో కదిరి 6 రకం 1100 క్వింటాళ్ళు, నారాయణి రక ం 350 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. . మండలంలోని రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని అందించనున్నారు. ఈనెల 23 నుంచి రైతు బరోసా కేంద్రాలలో కాయలు విక్రయాస్తిమని పేర్కొన్నారు. కదిరి–6 రకం బస్తా కాయలు రూ.1710లు చొప్పున విక్రయించనున్నామని అదేవిధంగా నారాయణి రకం బస్తా రూ.1746లు చొప్పున విక్రయిస్తామని చెప్పారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకము, ఫోన్ నెంబర్లతో సంప్రదించాలని ఆయన చెప్పారు.

## చక్రేశ్వరస్వామికి తిరుపతి గంగమ్మ అలంకరణ

శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన జెట్టిపాళెంలో ఉన్న చక్రేశ్వరస్వామి వారికి తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆలయంలో వెలసిన శివయ్యకు అమ్మవారి అలంకరణను ఆలయ అర్చకులు పరమేశ్వరస్వామి ఆధ్వర్యంలో చక్కగా అలంకరణ చేపట్టారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.

## వైభవంగా తిరుపతి గంగమ్మజాతర

రేణిగుంట, మే 21 ప్రభాతవార్త:



రేణిగుంట పట్టణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒడ్డిమిట్ట వద్ద కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ తిరుపతిగంగమ్మ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. జాతర నిర్వాహకుడు వి.దుర్గయ్య ఆధ్వర్యంలో జాతర కన్నుల పండువగా జరిగింది. ఆడపడుచులు, ముత్తైదువులు ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి అంబళ్లు సమర్పించి పొంగళ్లు పొంగించి తమ భక్తిని చాటుకున్నారు. జాతర నిర్వాహకుడు దుర్గయ్య ఆయన కుటుంబ సభ్యులను జాతరకు వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. విశేష సంఖ్యలోభక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## గంగమ్మతల్లి అందరిని చల్లగా దీవించమ్మా

పుత్తూరురూరల్, మే 21 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బజారువీధిలో వెలసిన శ్రీ పిడికిలి గంగమ్మతల్లికి తిరుపతి గంగజాతర సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పండ్లతో సుందరంగా అమ్మవారిని అలంకరించారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకరణలుచేశారు. అలాగే అమ్మవారికి పొంగళ్ళను, అంబళ్ళను నైవేద్యంగా పెట్టి భక్తులకు సమర్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పిండి దీపాలు పెట్టి పూజలు చేశారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించడం వల్ల భక్తులను ఆకట్టుకుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అనేక మంది హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు.

## శాంతియుత వాతావరణమే ధ్యేయం

-నగరంలో ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు

-తిరుపతి డిఎస్పీ రవిమనోహరచారి



తిరుపతి,మే 21ప్రభాతవార్తప్రతినిధి:

ఆధ్యాత్మికగ నగరం, స్మార్ట్‌సిటీ తిరుపతిలో ప్రశాంత వాతావరణం కొనసాగేలా పోలీసు సేవలు మెరుగుపరుస్తానని తిరుపతి డిఎస్పీ కె.రవిమనోహర చారి ఉద్ఘాటించారు. తిరుపతికి వచ్చే యాత్రికులతో బాటు నగరవాసులకు పూర్తి భద్రత కల్పించడమే పోలీసు ధ్యేయంగా పనితీరు ఉంటుందన్నారు. క్రిందిస్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బంది ఇందుకు సహకారం అందించేలా సూచనలు చేస్తానని, అన్ని విధాలా శాంతియుత వాతావరణం, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. తిరుపతి అంటే ప్రశాంతతకు మారుపేరుగా చర్చించుకునేలా చూస్తామన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనల మేరకు తిరుపతి డివిజన్‌లో పోలింగ్ తరువాత నెలకొన్న పరిస్థితులు చక్కబడ్డాయని, ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. కొందరు అవాంఛనీయసంఘటనలకు పాల్పడితే చూస్తూ సహించేది లేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే, రౌడీయిజం చేసినా,అల్లర్లకు పాల్పడినా చట్టపరిధిలో కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది 24గంటలూ అప్రమత్తంగా ఉండేలా వారిలో పనితీరు మార్పుజరుగుతుందన్నారు. ప్రజలు తమ కష్టాలను,తమ బాధలను చెప్పుకోవడానికి పోలీసుస్టేషన్‌కు వస్తే వారిపట్ల మర్యాదగా, మంచి మాటలతో పలకరింపు ఉండేలా సూచనలు చేస్తానన్నారు. పోలీసు సిబ్బంది కూడా నిజాయితీగా అంకితభావంతో పనిచేసి శాఖకు ,పై అధికారులకు మంచి పేరుతీసుకురావాలన్నారు. గతంలో తిరుపతి,తిరుమలతోబాటు ఉమ్మడిచిత్తూరుజిల్లాలో పలు చోట్ల ఎస్ఐ హోదా నుండి సిఐ,డిఎస్పీ హోదాల్లో పనిచేసిన అనుభవం ఉండటం, ఈ ప్రాంతంపై అవగాహన కలిగి ఉండటంతో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు మరింత దోహదపడుతుందన్నారు. నగరప్రజలు కూడా తమకు తెలిసిన సమాచారాన్ని సమీప పోలీసుస్టేషన్‌లకు తెలియజేయాలని డిఎస్పీ రవిమనోహర చారి కోరారు. ఏసిబి డిఎస్పీగా ఉన్న ఈయన ఇటీవల ఎన్నికల గొడవలపై విచారణకు సిట్ బృందంలో ఒక అధికారిగా తిరుపతిలో నిశితంగా దర్యాప్తు, విచారణ సాగించారు. ఆయన పనితీరును, అనుభవాన్ని పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర డిజిపి హరీశ్‌కుమార్‌గుప్త, కేంద్ర ఎన్నికల సంఘం తిరుపతి డిఎస్పీగా నియమించింది. మంగళవారం ఉదయం ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టిరు. అనంతరం గంగమ్మ జాతర కార్యక్రమంలో పాల్గొని బందోబస్తును పర్యవేక్షించారు. క్రిందిస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీని నియంత్రించడం, ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చూడటంలో సఫలీకృతులయ్యారు. తిరుపతి డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రవిమనోహర చారిని సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## షణ్ముఖునికి షోడషాభిషేకాలు:భక్తులతో కిట కిట లాడిన ఆలయం

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో అధ్యాత్మిక చింతన వెల్లి విరున్నుంది. మంగళవారం తెలుగు సంవత్సరాది సందర్భంగా పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు భక్తులతో కిట కిట లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయం,శ్రీకాళహస్తీశ్వరాలయంలో రంగుల గోపురం పక్కన వెలసిన స్వామి,ఆలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా తేరువీధిలో వెలసిన 'షణ్ముఖ స్వామి' ఆలయంలో స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. వందలాది లీటర్ల పాలు, పెరుగు,తేనే,విభూది,గంధం, కుంకుమ, పసుపు,సకల సుగంధ ద్రవ్యాలతో పూజలు అభిషేకాలు నిర్వహించారు.చూపరులను ఇట్టు ఆకట్టుకునే రీతిలో అర్చకులు ప్రసాద్,మురళిలు తీర్చి దిద్దుతున్నారు.

### షణ్ముఖ స్వామి ఆలయానికి పోటెత్తున్న భక్తులు:

శ్రీకాళహస్తి పట్టణంలోనూ, ఆలయంలో పలు సుబ్రమణ్యం స్వామి ఆలయాలున్నాయి. అయితే తేరువీధిలో ఆలయప్రధానార్చకులు స్వర్గీయ బాబు గురుకుల్స్‌కు చెందిన ఆలయం షణ్ముఖ స్వామి ఆలయం. ఇక్కడ సుబ్రమణ్యం స్వామి ఆరుముఖాలతో వెలసి దర్శనమిస్తున్నారు.ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉండటంతో ఇక్కడకు పట్టణ నలు మూలల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. భక్తులు ప్రతి ఒక్కరు పాలను, పెరుగును అందిస్తున్నారు. వాటితో అభిషేకాలు నిర్వహిస్తున్నారు.ఇక ఇక్కడ స్వాములు నిర్వహిస్తున్న అలంకారాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.ఇక భక్తులు వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తున్నారు. ఇక్కడ వెలసిన వినాయకుడు మహిమాన్వితుడని చెబుతారు. ఉదయం సూర్యోదయం నుంచి రాత్రి 9గంటల వరకు ఈ ఆలయంలో విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తున్నారు.కాగా ఆలయంలోని రంగుల గోపురం పక్కనే వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఆలయాల్లో కణితలు వచ్చిన వారు స్వామికి బెల్లం ముద్దలను నైవేద్యంగా పెట్టి పట్టణ నడిబొడ్డులోని నారద పుష్కరణిలో వేస్తున్నారు. కొన్ని వారాలకు వారికి నయం అవుతుందనే నమ్మకం ఉంది.

## మంచి మనిషి శాంతారాంకు ఘననివాళులు

శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త



పట్టణంలోని ద స్కూల్ ఆవరణలో మున్సిపల్ దేవస్థానం మాజీ ఛైర్మన్ స్వర్గీయ శాంతారాం రావు జె.పవార్ ఐదో వర్థంతి సందర్భంగా ద స్కూల్ ఆవరణలో ఉన్న పవార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆయన కుమార్తె డాక్టర్ అర్చన జె.పవార్ మాట్లాడుతూ మంచి మనిషి అని తమ మద్యనే ఎన్నడూ ఉంటాడన్నారు.తన తండ్రికి మరణం ఉండదన్నారు. ఆయన ఎప్పటికీ మరచిపోని ప్రజలు మనిషి అని మా మద్యనే ఉన్నాడన్నారు. రాజకీయాల్లో అజత శత్రువుగా అన్ని వర్గాల ప్రజల మనన్నలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో పివిఆర్ గ్రూపు ఎండి ప్రతాప్‌రావు వి.పవార్, జనార్ధన్‌రావు జె.పవార్, డాక్టర్ అర్చన జె.పవార్, మహేశ్వరరావు పడోల్కర్, హెచ్.బాబు, ద స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఏర్పేడులో గంగమ్మ జాతర వేడుకలు

ఏర్పేడు, మే21, ప్రభాతవార్త;



మండల కేంద్రమైన ఏర్పేడు యాదవ వీధిలో మంగళవారం గంగమ్మ జాతర వేడుకలను యాదవ రాజులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి శక్తి రూపాన్ని ముగ్గుగా వేసి భక్తి శ్రద్దలతో మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిదంగా మండలంలోని 40 పంచాయతీల్లోను తిరుపతి గంగమ్మ జాతరను పురస్క రించుకొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించుకున్నారు. స్త్రీ వేషాలు, శక్తి వేషాలతో యువకులు, వృద్దులు గ్రామాల్లో సందడి చేశారు.

## గంగమ్మ భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ

తిరుపతి,,మే 21ప్రభాతవార్త:



తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకల్లో భాగంగా చివరిరోజు జాతరతో మంగళవారం తాతానగర్‌లో దాతలు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీచేశారు. ఆలయానికి అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన సుదూర ప్రాంత భక్తులకు తాతానగర్‌లో ఎస్వీఆయుర్వేద కళాశాల విశ్రాంత వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి భక్తులకు పులిహోర, చక్కెరపొంగలి, పెరుగన్నం, అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు.

## గంగమ్మకు సారె అందించిన పవిత్రారెడ్డి, ఆలయ ఛైర్మన్

-మేళ తాళాలు మంగళవాయిద్యాలతో సమర్పణ

శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి బిసి అగ్రహారంలో గంగమ్మ జాతర సంబరాలు మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. తిరుపతి తాతయ్యగుంట జాతరతో పాటు అగ్రహారం జాతరను నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి అగ్రహారం జాతర సందర్భంగా పొన్నాలమ్మగుడి వద్ద పొంగళ్ళను మహిళలు భారీ ఎత్తున సమర్పించారు. కాగా పొంగళ్ళు నిర్వహించుకొనుటకు ఆలయ ఛైర్మెన్ సారధ్యంలో ఏర్పాటు చేసారు.

### సారె సమర్పించిన పవిత్రారెడ్డి, ఆలయ ఛైర్మన్ అంజూరు..

శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి అనుబంధ ఆలయాలు, సమీపంలోని ఆలయాలకు 'సారె సమర్పించే' సంప్రదాయాన్ని ప్రస్తుత ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రవేశ పెట్టారు.మంగళవారం రాత్రి కన్నుల పండువగా అంగరంగ వైభవంగా యువకుల నృత్యాలతో ఎంఎల్ఏ తనయ బియ్యపుపవిత్రారెడ్డి రాగా ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ సభ్యులు చింతామణి పాండు, బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్‌ఆర్కాడు శంకర్,తదితరులు శాస్త్రోక్తంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ మన పండగలు,సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నాలుగు సార్లు జాతరలు నిర్వహించటం ఆనవాయితి అన్నారు. పట్టణ ప్రజలు ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహించటం అభినందనీయం అన్నారు.అగ్రహారం,పానగల్,ఏడుగంగమ్మ జాతర నల్లగంగమ్మ జాతరలు నిర్వహించటం ఇక్కడి ధార్మికతకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో గంగమ్మ జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టిడిపిలోనే బిసిలకు అగ్రతాంబూలం

తొట్టంబేడు, మే 21 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీలోనే బిసిలకు అగ్రతాంబూలం ఉంటుందని అగ్రవర్ణ దురహంకార సమాజంలో నలిగిపోతున్న వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడి వారిని సామాజికంగా రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకురావడానికి గడచిన నలభై సంవత్సరాలుగా నిర్విరామంగా కృషిచేస్తున్న తెలుగుదేశంపార్టీ లోని బిసిలకు అగ్రతాంబూలం అని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారిగురవారెడ్డి బిసి విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులైన రెడ్డివారిగురవారెడ్డిని దుశ్శాలువ పూలమాలతో సత్కరించారు. ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి పనిచేయాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు నిస్తేజంగా ఉండిపోతే సమాజానికి ఎలాంటి నష్టం జరుగుతుందో చెప్పడానికి రాష్ట్రంలో గడచిన ఐదు సంవత్సరాల కాలంలో వైఎస్ జగన్‌రెడ్డి సాధించిన ఆటవిక పరిపాలనే చక్కటి ఉదాహరణ అని గురవారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో చేపట్టబోయే అనేక ప్రక్షాళన కార్యక్రమాల్లో మొదటిది పోలీసుశాఖ ప్రక్షాళన కార్యక్రమం ఉంటుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో షేక్‌జిలానీ, కోట.చంద్రశేఖర్, ఖాదర్‌బాషా, బీమాలభాస్కర్, చాంద్‌బాషా, హబీబ్, రియాజ్, మొఘల్ అహ్మద్, రఫి, పూలశేఖర్, నూర్‌మహ్మద్, రమేష్, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఇదెక్కడి ఆటవిక న్యాయం

-యానాదులకు పట్టణాల్లో జీవించే హక్కులేదా?

-చెంచులక్ష్మి కాలనీని కాపాడండి..చందమామలకోటయ్య

తొట్టంబేడు, మే 21 ప్రభాతవార్త



అనాదిగా యానాదులను అణగదొక్కుతూనే ఉన్నారని నాగరికతకు అలవాటు పడదామంటే అడవులకే పొమ్మంటున్నారని ఇదెక్కడి ఆటవిక న్యాయం అని న్యాయమని యానాది సంఘ రాష్ట్ర అధ్యక్షులు చందమామలకోటయ్య అన్నారు. గిరిపుత్రులుగా పుట్టినందుకు తమకు అడవుల్లో కాకుండా మైదానాల్లో బతికే స్వచ్ఛకూడా లేదా? ప్రశ్నించారు. మంగళవారంరాజీవ్‌నగర్‌లోని యానాది సంఘ కార్యాలయంలోమీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూరాజీవ్‌నగర్ కాలనీలో నూతనంగా ఏర్పడ్డ ఎంఎస్ఆర్ చెంచులక్ష్మి కాలనీలోగత కొంత కాలంగా యానాదులపై కొందరు భూకబ్జాదారులు సాగిస్తున్న దౌర్జన్యకాండ మీడియాకు వివరించి కన్నీటి పర్యంతమైనారు. రాజీవ్‌నగర్ సర్వే నంబర్ 239,240 లో సుమారు 2.20 ఎకరాలు ప్రభుత్వ స్థలంలో 56మంది యానాదులకు 2014 నుంచి పునాదులు తవ్విగుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారనితెలిపారు. వీరికి ఇక్కడే ఆధార్, రేషన్ కార్డులు కూడా ఇచ్చారని విద్యుత్ సర్వీసులు కూడా ఉన్నాయని తెలిపారు. అయితే పట్టణానికిచెందిన ఓ మాజీ కౌన్సిలర్‌వేదాం, కాళంగి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు యానాదులు తవ్విన పునాదులను ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎదురుతిరిగితే దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సుల మేరకు యానాదులు ఎక్కడైనా గుడారాలు వేసుకుని స్వేచ్ఛగా జీవించే హక్కు కలదని వివరించారు. అలాంటి ప్రభుత్వ భూమిలో పునాదులు వేసుకుంటే పట్టాలిచ్చి హక్కు కల్పించాల్సిందిబోయి వాటిని ధ్వంసం చేస్తుంటే వేడుక చూస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యానాదులుపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి ఎంఎస్ఆర్ చెంచులక్ష్మి కాలనీని కాపాడకుంటే జూన్ 14న పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. యాదాది సంఘం నాయకులు రవీంద్ర, రత్న, శ్రీనివాసులు,మునస్వామి, నాగరాజు, రాధమ్మ, లలితమ్మ, మునెమ్మ, చెల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నాళమ్మకు పొంగళ్ళు-విశేషాలంకరణలో అమ్మవారు

.శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం పట్టణంలోని పానగల్‌లో వెలసిన పొన్నాళమ్మకు ఉదయం నుంచి విశేషాలంకరణలో అమ్మవారికి అభిషేకాలు, హారతులు ఇచ్చి అమ్మవారికి విశేషాలంకరణ చేపట్టారు. ఈసందర్భంగా ఆలయం మహిళా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో పొంగళ్ళు పెట్టడంతో పాటు మొక్కులుతీర్చుకున్నారు. కాగా వచ్చిన భక్తులు అంబళ్ళుపోశారు. అనంతరం ఆలయం వద్ద చెట్టు వద్ద వెలసిన నాగశిలలకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులుతీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు చర్యలుతీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జగదీష్, హరి, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అల్లర్లకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తాం..!

కౌంటింగ్ ముగిసినా శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కటకటాలే

చంద్రగిరి ఫ్లాగ్ మార్చ్‌లో సిఐ రామయ్య

చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త:

ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తూ అల్లర్లకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామని సిఐ రామయ్య హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున చోటుచేసుకున్న ఘర్షణలకు, హింసాత్మక ఘటనలకు చంద్రగిరి నియోజకవర్గం వేధికై రికార్డులకెక్కిన విషయం విధితమే. ఈ నేపధ్యంలో తిరుపతి జిల్లా నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు.. శాంతిభద్రతల సంరక్షణకు సహకరించాలని కోరుతూ మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో సిఐ రామయ్య చంద్రగిరి వీధులలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ రాజకీయ పార్టీల కార్యకర్తల ముసుగులో సంఘ విద్రోహ చర్యలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, హింసాత్మక ఘటనలకు పాల్పడినా కటకటాలు లెక్కబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని ధైర్యంగా వుండాలని అన్నారు. ప్రజల రక్షణకు పోలీసులుతగినచర్యలుతీసుకున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిత, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

## శింగరికోన లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్వాతి నక్షత్ర పూజలు

నారాయణవనం, మే 21 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామపరిధిలోని శింగిరికోనలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ంలో మంగళవారం స్వాతి నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లను పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీరు, చందనం వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు మూడు పూట్ల ఉచిత అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు జలపాతంలో కూడా పవిత్ర స్నానాన్ని ఆచరించారు. అలాగే ఆలయంలో సుదర్శన్ హోమంను తిరుపతి నుంచి వచ్చిన అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ పి గుణవంతరావు, సభ్యులుపిగిరిబాబు, భాస్కర్‌బాబు, మదు, అర్చకులు హరిబాబుస్వామి, శరవణ, సిబ్బంది పాల్గొన్నారు.

## తుడా షటెల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

తిరుపతి హెల్త్, మే 21, ప్రభాతవార్త



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర పురస్కరించుకుని మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒక గంట వరకు ఇందిరా మైదానం దగ్గర పదివేల మంది భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తుడా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్రయ్య, మాజీ ఏపీ హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్ జానకిరామ్ రెడ్డి, ఎంసికె ఫైనాన్సియల్ సర్వీసెస్ కుంట్రపాకం మురళి, శ్రీజ అండ్ మ్యాక్స్ పవర్ సర్వీసెస్ మేనేజర్ లంకిపల్లి కృష్ణ, ఇన్ఫినిటీ ఫైనాన్స్ సొల్యూషన్ ప్రాంతీయ అధికారి మోహన్ ముదిరాజ్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కుమార్, వేలూరి రవి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

పుత్తూరురూరల్, మే 21 ప్రభాతవార్త:

గ్రామాల్లో తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీపీ మునివేలు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల ప్రభుత్వ పథకాల గురించి సమీక్ష నిర్వహించకుండా ఎలాంటి తీర్మానం ప్రతిపా దించకుండా సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్‌గాంధీ 43వ వర్ధంతి

కేవీబీ పురం, మే 21 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురంలో భారత్ పెట్రోలియం గ్యాస్ ఆఫీసులో మంగళవారం ఉద యం రాష్ట్ర ముదిరాజ సంఘం డైరెక్టర్ తెరణి ధనంజయరెడ్డి రాజీవ్‌గాంధీ 43వ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. మన భారతదేశానికి నిజానికి తీరని లోటని రాజీవ్‌గాంధీ సేవలను మరోసారి కొనియాడుతూ ఆయన జోహార్ రాజీవ్ గాంధీ, రాజీవ్‌గాంధీ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధనంజయరెడ్డితో పాటు ఆనంద్‌రెడ్డి, మండల మాజీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, పాతపాళెం మాజీ సర్పంచ్ ప్రసాద్‌శర్మ, భాస్కర్, గోపి, లత, మునెమ్మ, జయరామ్‌శెట్టి, పలువురు మండల నాయకులు, పలువురు యువకులు, గ్యాస్ లబ్ధిదారులైన మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మవారికి పొంగళ్లు

కేవీబీ పురం, మే 21 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన కేవీబీ పురం శ్రీశ్రీ సీతారామ అమ్మవారి ఆలయంలో మంగళవారం తిరుపతి గంగమ్మజాతర సందర్భంగా గ్రామ సర్పంచ్ కరపారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ఆలయంలో అమ్మవారికి ఉదయం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి జంతుబలిచి నైవేద్యం సమర్పించారు. పలువురు గ్రామ మహిళలు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## పాపానాయుడుపేటలో కన్యకాపరమేశ్వరి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు

ఏర్పేడు, మే 21 ప్రభాతవార్త;



మండలంలోని పాపానాయుడుపేట మేజర్ పంచాయతీలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆరవ వార్షిక బ్రహ్మోత్సవాలను గ్రామస్థులు మంగళవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు, మరియు భక్తులు 108 కలిశములతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహిం చారు. తదుపరి అభిషేక మహోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పరిసర గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేశారు.

## పాస్ పోర్ట్ పోయింది

ముప్పు విజయమ్మ దక్కిలి మండలం,నగులపడు నుంచి శుక్రవారం నాడు వెంకటగిరికి వస్తుండగా పాత బస్టాండ్ సమీపంలో పాస్‌పోర్ట్ పోయినది. పాస్‌పోర్ట్ నెంబరు S2650304

## తిరుపతి జాతర దృశ్యాలు









## చిత్తూరు జాతర దృశ్యాలు







# ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెట్టాలి

**-జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



తవణంపల్లె, మే 21 ప్రభాతవార్త: నదులు, వాగులు, వంకల నుండి ఇసుకను అ క్రమంగా తరలించే వారిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, విఆర్ఏలు కేసులు కేసులు పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉత్తర బ్రాహ్మణపల్లె వద్ద బహుదానదిలో గుర్తించిన ఇసుక రీచ్‌ను జాయింట్ కలెక్టర్ వివిధ ప్రభుత్వ అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇసుక రీచ్‌లకు ఇచ్చిన అనుమతుల గడువు పూర్తయి పోయిందని తెలిపారు. కావున ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను అక్రమంగా తరలించే వారిపై పంచాయతీ కార్యదర్శులు,విఆర్ఓలు, విఆర్ఏలు పోలీసు కేసులు పెట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతి రోజూ రెండు సార్లు ఇసుక రీచ్‌లను పరిశీలించాలన్నారు. అలాగే ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అలాగే గ్రామాలలో టాంటాం వేయించాలని ఆదేశించారు. ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరుగకూడదని తెలిపారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజా ప్రతినిధులు, ప్రజలు సంభందిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, విఆర్ఏలపై వుందని ఎక్కడా వాగులు, వంకలు, నదుల్లో వేస్టేజి వేయనీయకుండా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో సెబ్ ఇన్‌చార్జి, ఏఎస్పీ సుబ్బరాజు, భూగర్భ గనులశాఖ డీడీ కెఎల్ఎం. ప్రసాద్, జియాలజిస్టు పోలిరెడ్డి, కాలుష్య నియం త్రణ మండలి ఏఈఈ మదన్‌మోహన్, జిల్ల పంచాయతీ అధికారి టి.లక్ష్మీ, చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఏఓ వాజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో టిడిపి జెండా ఎగురుతుంది : గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మే 21 ప్రభాతవార్త : ఎన్నికల్లో విజయం సాధించి నగరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురుతుందని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాశ్ తెలిపారు. మంగళవారం తిరుత్తణిలో సుబ్రమణ్యస్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ టిడిపి మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం, మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని దీనిని గ్రహించి ప్రజలు ఎన్డీయే కూటమికి ఓట్లేసారన్నారు. జూన్ మొదటి వారంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆంధ్రప్రదేశ్‌లో సైకో పాలన ముగుస్తుందని పేర్కొన్నారు. నగరి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో గతంలో ఎన్నడూ లేనంత మెజార్టీతో తాను ఎమ్మెల్యేగా గెలుస్తానని తెలిపారు.

## మజ్జిగ పంపిణీ చేసిన వాకర్స్ అసోసియేషన్



తిరుపతి హెల్త్, మే 21 ప్రభాతవార్త : బాబు జగ్జీవన్ రామ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మజ్జిగ దాత ఉదయగిరి రఘు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటలకు వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ కార్యక్రమం రెండవ రోజు దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ విచ్చేసారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ద్వారా తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా వాకింగ్ చేసే వాకర్స్ సభ్యులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది బాబు జగ్జీవన్ రామ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయరాం, లీలాకృష్ణమ నాయుడు, రవిచంద్ర, చెంగల్రాయులు, మునిబాబు, రెడ్డయ్య, వేణు రాయల్, దయాకర్, తదితర వాకర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గంగమ్మ విశ్వరూప దర్శనం

**- పోటెత్తిన భక్తులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు**



పలమనేరు, మే 21 ప్రభాతవార్త: పలమనేరు గ్రామ దేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారి విశ్వరూప దర్శనం మంగళవారం నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపు అనంతరం ఆలయానికి అమ్మవారు చేరారు. మంగళవారం ఉదయం నుంచే అమ్మవారి విశ్వరూప దర్శనం భక్తులకు దేవదాయ శాఖ అధికారులు కల్పించారు. భక్తుల దర్శనం కోసం ఆలయం వద్ద రెండు క్యూలైన్లను దేవదాయశాఖ, పోలీసు అధికారులు ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య సంఘం, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గాండ్ల సంఘం, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బలిజ సంఘం నేతలు పెద్ద ఎత్తున అన్న ప్రసాదాలు పంచారు. కాగా అమ్మవారి శిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శనాలు ప్రశాంత వాతావరణంలో జరగడంతో పాటు ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## భక్తి శ్రద్ధలతో గంగజాతర : ఎస్పీ మణికంఠ



చిత్తూరు, మే 21 ప్రభాతవార్త: చిత్తూరు నడివీధి గంగజాతరను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. చిత్తూరు నడివీధి గంగమ్మను మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు దర్శించుకొని మాట్లాడుతూ చిత్తూరు నగర పరిసరాల్లో బుధవారం భారీ వర్షసూచన వుందని వాతావరణ కేంద్రం తెలియజేయడంతో భక్తులు తగు జాగ్రత్తలతో జాతరను నిర్వహించుకోవాలన్నారు. అలాగే బుధవారం గంగమ్మ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ మళ్ళింపు వుంటుందని వాహనదారులు ఇతర మార్గాలను ప్రయాణం కోసం ఎంచుకొని పోలీసులకు సహకారం అందించాలన్నారు. భక్తుల రక్షణార్థం బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, పిట్ పాకెటింగ్, అకతాయిల వెకిలి చేష్టల కట్టడికి నిష్ణాతులైన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వీటిని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. పోలీసులు సిసి కెమెరా ఫుటేజ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తుంటారన్నారు. జాతర సందర్భంగా ఎవరికైనా సమస్య ఉత్పన్నం అయితే సమీపంలోని పోలీసులు లేదా 100 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 94409 00005 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## వేంగమాంబకు పుష్పాంజలి

తిరుపతి,మే 21ప్రభాతవార్త: ఏడుకొండల వేంకటేశ్వరస్వామిపై భక్తిశ్రద్ధలతో అనేక సంకీర్తనలను తరిగొండ వెంగమాంబ రచించారని, ఆమె సాహిత్యం, రచనలు,కీర్తనలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్ళారని టిటిడి జెఈఓ గౌతమి తెలిపారు. వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు మంగళవారం అన్నమాచార్యకళామందిరంలో జరిగాయి.అనంతరం ఆమెచిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## కల్యాణవేంకటేశ్వరునికి పట్టుచీర వితరణ



నారాయణవనం, మే 21 ప్రభాతవార్త : నారాయణవనంలో వెలసిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. నారాయణవనం పట్టుశాలీ వంశస్తులు ప్రతి ఏడాది పట్టు వస్త్రాలను అమ్మవారికి, శ్రీవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నది. పట్టుశాలీ వంశస్తులు వట్టువస్త్రాలను పట్టుశాలీవీధిలో వెలసిన కనకవల్లీ వేదవల్లీ సమేత వీరరాఘవులస్వామి వారి ఆలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి టిటిడి అధికారులకు అందించారు. కార్యక్రమంలో పట్టుశాలీ వంశం సభ్యులు గుడ్డల.వీరాస్వామి, యార్ల.జయరామయ్య, యార్ల.తులసీముని, యార్ల.పురుషోత్తం, గుడ్డల.గురుస్వామి, సుబ్రమణ్యం, పట్టుశాలీ వంశస్తులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మయూరి శ్యామ్ యాదవ్‌కి చోటు

**ఈ అవార్డుతో నా బాధ్యత మరింత పెరిగింది -మయూరి శ్యామ్ యాదవ్**



గూడూరు, మే 21 ప్రభాతవార్త : శ్రీ కృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యులు రొటేరియన్ డాక్టర్ బండి శ్యామ్ సుందర రావు (మయూరి శ్యామ్ యాదవ్)కి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు పొందడం జరిగింది. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ 2006వ సంవత్సరం నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, ఈ అవార్డు రావడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ అవార్డుతో నా పై మరింత బాధ్యత పెరగిందని ఆయన అన్నారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రెసిడెంట్ నీలం ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేంద్ర గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

## అశ్వవాహనంపై దేవదేవుడు



చౌడేపల్లి, మే 21 ప్రభాతవార్త : స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రసన్న పార్వతీ సమేత మృత్యుంజయేశ్వరుడు గుర్రపు వాహనంపై ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి విశేషాభిషేకం, అలంకరణగా వించారు. ఉత్సవ విగ్రహాలను అశ్వంపై వుంచి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అన్నం కులస్థులు వాహనానికి ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## ఎన్నికల అక్రమ కేసులపై పోరాటం సాగిస్తా

**-బోడే రామచంద్రయాదవ్**



పుంగనూరు,మే 21 ప్రభాతవార్త : ఎన్నికలలో తన అనుచరులపై పెట్టిన అక్రమ కేసులపై పోరాటం సాగిస్తానని బోడె రామచంద్రయాదవ్ అన్నారు. మంగళవారం ఆయన చిత్తూరు జైలులో రిమాండ్‌లో ఉన్న తన అనుచరులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో ఐదేళ్ళుగా మంత్రి రామచంద్రారెడ్డి తనపై తన అనుచరులపై అనేక కేసులు పెట్టించారని, పోలీసులు దేశమంతటా బాగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ, జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డికి అనుగుణంగా పనిచేస్తూ దారుణాలకు తెరతీస్తున్నారని ఆరోపించారు. ఈఎన్నికలలో పుంగనూరు ప్రజలు మంత్రికి తగిన గుణపాఠం నేర్పడానికి సిద్దంగా ఉన్నారన్నారు. తన అనుచరులను కాపాడుకునేందుకు వెనుకాడబోనని, అలాగే తన పార్టీకు చెంది పోలీసుల నుంచి,ఇతర పార్టీల నుంచి దాడులు,కేసులకు గురయిన వారిని ఆదుకంటానన్నారు. పుంగనూరు బాగుకోసం తన పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట చనకంటి సాంబమూర్తి,దళిత నాయకుడు ఆనంద,ధనుంజయతో పాటూ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో జూన్4న వైకాపా విజయోత్సవాలు

**-జిల్లా వైకాపా మైనార్టీ నాయకుడు సిద్దిఖ్ వెల్లడి**



పుంగనూరు,మే 21 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడనున్న జూన్ 4వ తేదీ ముఖ్యమంత్రి జగన్,మంత్రి పెద్దిరెడ్డి,ఎంపి మిధున్‌రెడ్డిల గెలుపుపై దుబాయ్‌లో విజయోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా వైకాపా మైనార్టీ నాయకుడు సిద్దిఖ్ వెల్లడించారు. దుబాయ్‌తో పాటూ షార్జా,మర్దుబాయ్ ప్రాంతాలలో ఉన్న వైకాపా మద్దతుదారులతో ఇటీవల కలసి విజయోత్సవాల నిర్వహణ గురించి చర్చించామన్నారు. దుబాయ్ వైకాపా శాఖ అధ్వర్యంలో జరగనున్న ఈ విజయోత్సవ వేడుకలలో వందలాది మంది ఆంధ్రులంతా కలసి ఒకే వేదికపై ఉత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లు జరగబోతున్నాయన్నారు. తన ఆధ్వర్యంలో సాగే ఈ విజయోత్సవాలను నేరుగా దుబాయ్‌నుంచి లైవ్ ద్వారా ప్రసారం చేయడానికి అనుమతి కోరామన్నారు. ప్రపంచంలోని తెలుగువారంతా ఇపుడు రాష్ట్రంలో సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి మిధున్‌రెడ్డిల విజయం కంటే వారు సాధించే మెజార్టీను అంచనావేయడంలో ఉన్నారన్నారు. సిఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత దుబాయ్‌లో ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాలకు దూరంగా ఉన్న ప్రవాసీయులకు ఏడాదికి ఒకసారి విమాన చార్జీలలో సగభాగం మినహాయింపు ఇచ్చేలా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా కోరనున్నట్లు తెలిపారు.

## గంగమ్మకు మొక్కులు తీర్చుకున్న చెవిరెడ్డి కుటుంబ సభ్యులు



తిరుపతిరూరల్, మే 21 ప్రభాతవార్త: తిరుపతి గంగజాతరను పురస్కరించుకుని మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మొక్కులు తీర్చుకున్నారు. వేప మండలు, వెలుగుతున్న దీపాలతో కూడిన కుండలు తలపై పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రదక్షణలు చేసారు. అనంతరం గంగమ్మ దర్శనం చేసుకున్నారు. గంగమ్మను దర్శించుకున్నవారిలో తుడా చైర్మెన్, చంద్రగిరి వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యధర్శి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

## శేష వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు



సదుం, మే 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని బూరగమంద గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో ఉదయం తిరుచ్చి సేవ నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు.రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి శేషవాహన సేవ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధులలో ఊరేగించారు. అదేవిధంగా మంగళవారం రాత్రి స్వామి వారిని హంస వాహనంపై ఊరేగించారు. ఆలయ అర్చకులు ఈ కార్యక్రమాన్ని వేద మంత్రాల నడుమ నిర్వహించారు. గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అదేవిధంగా సదుంలోని సుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ఉదయం అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

## ఘనంగా పులిచెర్ల,మంగళంపేటలలో గంగజాతర



కల్లూరు, మే 21 ప్రభాతవార్త : పులిచెర్ల మండలంలో రెండు రోజులుగా తిరుపతి గంగమ్మ జాతరలు ఘనంగా నిర్వహించారు. మంగళంపేటలోని శ్రీశ్రీశ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో పూజారి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. అదిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. అదేవిధంగా పులిచెర్లలోని గంగమ్మ జాతర జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మెన మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో దీపారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో అర్చకులు రాజశేఖర్ గురుకుల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి చల్లపోశారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉభయదారులు మురళీమోహన్‌రెడ్డి, బోయకొండ ఆలయ కమిటీ మాజీ సభ్యుడు రాయల్‌మోహన్, వైకాపా మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, పీహెచ్‌సీ చైర్మెన్ రవీంద్రరెడ్డి సర్పంచి రానెమ్మ, ఎస్వీరమణ,శ్రీదర్, దొర ,గురుస్వామి, మధుసూధన్‌రెడ్డి, రామ్ కుమార్‌రెడ్డి, ప్రభాకర్, నిరంజన్‌రెడ్డి, భూపతి మహేశ్వరరెడ్డి కొండ మురళిదొర, కుమార్‌రెడ్డి, కేశవులునాయుడు, రవిఆచారి,బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆరేపల్లి రంగంపేటలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్

**ముగ్గురు సిఐలు, నలుగురు ఎస్ఐలు, 70 మంది**

**ఇళ్ళు, దుకాణాల్లో విస్తృత సోదాలు – రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు : సిఐ రామయ్య**



చంద్రగిరి, మే 21 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు పోలింగ్ రోజున, ఆ తదుపరి చంద్రగిరి నియోజకవర్గంలో చోటు చేసుకున్న అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో పోలీసులు ఆరేపల్లి రంగంపేటలో మంగళవారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు.. చంద్రగిరి మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల పరిధిలోని ఏ.రంగంపేట, కృష్ణాపురం గ్రామాలలో ముగ్గురు సిఐలు శ్రీకాంత్ రెడ్డి (తిరుచానూరు), మస్తాన్ వలీ (భాకరాపేట), రామయ్య (చంద్రగిరి), ఎస్ఐలు అనిత, చిరంజీవి ఉమ్మడి ఆధ్వర్యంలోని 70 మంది సిబ్బంది ఇళ్ళు, దుకాణాలలో మారణాయుధాలు, నేరాలకు వినియోగించే వస్తువులను విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అన ంతరం ఎటువంటి హింసాత్మక ఘటనలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవ్వైరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

## భక్తిశ్రద్దలతో చిన్నకొట్టాయ్ ఉత్సవం



శ్రీకాళహస్తి, మే 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదోరోజు మంగళవారం చిన్న కోటాయ్ ఉత్సవం ప్రారంభం అయ్యింది. సోమవారం సాయంత్రం ఆలయంలోని అలంకారమండపం వద్ద స్వామి అమ్మవార్ల ఉత్స వర్లను చక్కగా రాజేష్ గురుకుల్,సూరి గురుకుల్ అలంకరించారు. వేసవి కాలంలో చిన్న కోటాయ్ ఉత్సవాలను పది రోజులపాటు జరిగే ఉత్సవాలను శనివారం ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఒ ఎస్.వి.నాగేశ్వరరావుల సంకల్పంతో శ్రీకారం చుట్టారు.చిన్న కోటాయ్ ఉత్సవం సందర్భంగా అలంకార మండపాన్ని చక్కగా మామిడి తోరణాలతో, అరటి చెట్లతో ముస్తాబు చేసారు.ఆలయ పొరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలనుపఠిస్తుండగా,ఆలయ అర్చకులు కరుణాకర్ గురుకుల్ ప్రత్యేక పూజలు జరిపారు.తరువాత స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను ఊరేగింపుగా ఆవరణలోని పొగడ చెట్టు కిందకు తెచ్చారు.కాగా ఇక్కడ చక్కగా వట్టివేళ్ళ పరదాలు ఏర్పాటు చేసారు.స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు షోడశాభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు చక్కగా అలంకరించి పూజలు,నైవేద్యాలు అందించారు. తరువాత ఊరేగింపు జరిపారు.అలంకార మండపంలో చేర్చారు.